క్లుప్తంగా

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: వ్యాధి నిరోధక టీకాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పీహెచ్ఎన్ లక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం జరిగిన వ్యాధి నిరోధక టీకాల పంపిణీని ఆమె పరిశీలించారు. టీకాల పంపిణీ రికార్డులు, నిల్వల పరిశీలించారు. అనంతరం పీహెచ్ఎన్ మాట్లాడుతూ ప్రతి బుధవారం చిన్నారులకు బీసీజీ, హెపటైటిస్ బీ, పెంటా, పీసీవీ, రోటా, ఓపీవీ, ఎమ్మార్ తదితర టీకాలను వేస్తారన్నారు. దీంతో కోరింత దగ్గు, పచ్చ కామెర్లు, తట్టు, టీబీ తదితర వ్యాధులు సోకవన్నారు. క్రమం తప్పకుండా వాటిని చిన్నారులకు వేయించాలని బాలింతలకు సూచించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని విలేజ్ క్లీనిక్‌ల్లో చిన్నారులకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అటెండర్‌కు ఘన సన్మానం



అటెండర్ దంపతులను సన్మానించిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది

ఎన్‌పీకుంట: తహసీల్దార్ కార్యాలయ అటెండర్ ఎం.రామాంజులు ఉద్యోగ విరమణ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన్ను బుధవారం ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ నరేంద్రకుమార్, డీటీ రవినాయక్ మాట్లాడుతూ అటెండర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మనోహర్, ఆర్ఐ శ్రీధర్, వీఆర్వోలు దీపిక, అనూష, కిష్టప్ప, రవి, చంద్రశేఖర్‌రెడ్డి, వీఆర్ఏలు రూపా, రమణ, రమేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారు



ఈశ్వరయ్యను సన్మానించిన తోటి ఉపాధ్యాయులు

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈశ్వరయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని ఈశ్వరయ్యను కొనియాడారు. ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్ది వారికి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుపాల్‌నాయక్, చెన్నకేశవులు, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, సహచర ఉపాధ్యాయులు శ్రీకాంత్‌రెడ్డి, సుబహాన్, షఫి, అశోక్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, గౌస్‌ఖాన్, అనిత, విజయలక్ష్మి, శ్రీదేవి, రాణి, లక్ష్మీదేవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచండి

ఎన్‌పీకుంట: విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఇన్‌చార్జ్ జీసీడీఓ సంపూర్ణ ఉపాధ్యాయినులకు సూచించారు. ఎన్‌పీకుంట కేజీబీవీని ఆమె బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్ ద్వారా 6వ తరగతిలో ఎంత మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థినులకు అందించే పౌష్టికాహారంలో తాజా కూరగాయలు వాడాలని తెలిపారు. నూతనంగా చేరిన విద్యార్థులకు చదవడం, రాయడం అలవాటు చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాటన్ బ్యాగుల పంపిణీ



బ్యాగులను పంపిణీ చేస్తున్న రవినాయక్

కదిరి అర్బన్: మండల పరిధిలోని బోడేనాయక్ తండా, మీటీనాయక్‌తండా గ్రామాల్లో హర్ట్ టూ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు కాటన్ బ్యాగులు పంపిణీ చేశారు. పర్యావరణం పెంపొందించేందుకు ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ఇలాంటి కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ చైర్మన్ రవినాయక్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మేఘమా.. వర్షించుమా..?



దోబూచులాడుతున్న మేఘాలు



చిగిచెర్ల సమీపంలో పొలాలను సిద్ధం చేసుకున్న దృశ్యం

- కరుణ చూపని వరుణుడు
- వర్షం కోసం రైతుల ఎదురుచూపు
- ముందుకు సాగని ఖరీఫ్ పంటల సాగు

ధర్మవరం రూరల్: మేఘాలు ఊరిస్తున్నా వరుణుడు కనికరించడం లేదు. దీంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. మృగశిర, ఆరుద్ర కార్తెలలో పదునైన వర్షాలు కురుస్తాయని రైతులు భావించారు. అయితే కార్తెలు ముగిసినా చినుకు జాడ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 15లోపు వేరుశనగ సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉందని వ్యవసాయాధికారులు చెపుతున్నారు. ఈ వ్యవధిలో ఎప్పుడు వర్షాలు వచ్చినా విత్తనాలు వేసుకోవచ్చని అంటున్నారు. ముందస్తుగా వేరుశనగ సాగు చేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. కొంతమంది రైతులు తొలకరి వర్షాలకే బోరుబావుల కింద వేరుశనగ సాగు చేసుకున్నారు. ధర్మవరం మండలంలో 17వేల హెక్టార్లు, బత్తలపల్లి మండలంలో 12,500 హెక్టార్లు, తాడిమర్రి మండలంలో 14వేల హెక్టార్లు, ముదిగుబ్బలో 21 వేల హెక్టార్లలో వేరుశనగ, కంది పంటలు సాగు చేస్తారు. అయితే కొద్ది రోజుల క్రితం తేలికపాటి వర్షాలకు సుమారు 400 హెక్టార్లలో అక్కడక్కడ వేరుశనగ సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెపుతున్నారు.

ఊజీ పడుతున్న విత్తనాలు

చాలామంది రైతులు నెల రోజుల క్రితమే వేరుశనగ కాయలు వలిచి ఇంట్లో నిల్వ చేసుకున్నారు. ఎరువులు కూడా సిద్ధం చేసుకున్నారు. వర్షాలు సకాలంలో కురిస్తే ముందస్తుగా వేరుశనగ సాగు చేసుకోవచ్చని భావించారు. అయితే నేటికీ చినుకు జాడ లేకపోవడంతో ఇళ్లల్లో నిల్వ చేసిన విత్తనాలకు ఊజీ (పురుగు) పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుణుడు కనికరిస్తే విత్తనాలు వేసుకుందామని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోండి

ధర్మవరం అర్బన్: పట్టణంలో నిబంధనలు పాటించని జీవనజ్యోతి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మార్సీ వద్ద విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేశారు. అనంతరం ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. జీవనజ్యోతి పాఠశాలలో నిబంధనలకు విరుద్ధగా వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. అనంతరం ఎంఈఓను పాఠశాలకు పిలిపించి తనిఖీలు చేయించారు. కార్యక్రమంలో పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పోతలయ్య, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నిరంజన్, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు నందకిషోర్, సునిల్, సుకృత్, సాయినాథ్, పురుషోత్తం, భరత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం

తాడిమర్రి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి రానంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. అర్హత ఉండి పథకాలు వర్తింపజేయకపోతే ఆందోళనలు, న్యాయపోరాటాలు చేసైనా సాధించుకోవాలన్నారు. అందరూ ఐకమత్యంతో పార్టీ కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 8న దివంగత నేత వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు పొరాళ్ల విజయ భాస్కర్‌రెడ్డి, వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వడ్డి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, నాయకులు యలక శ్రీనావాసరెడ్డి, సల్లాపురం బాలరమణారెడ్డి, మదమంచి మల్లికార్జున నాయకుడు, సిద్దే ఆదిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సర్పంచులు సాకే ఆదెప్ప, కుంటాల పుల్లయ్య, శెట్టిపల్లి వెంకటనారాయణరెడ్డి, నారాయణస్వామి, ఎంపీటీసీలు పెద్దన్న, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

ఉపాధి సిబ్బంది నుంచి రూ.70 వేలు రికవరీ

లేపాక్షి: మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన ప్రజావేదిక గ్రామసభలో అధికారులు రూ. 70 వేలు రికవరీ చేశారు. మండల వ్యాప్తంగా గత నెల 27వ తేదీ నుంచి ఈనెల 1వ తేదీ వరకూ సామాజిక తనిఖీ బృందం వివిధ పనులను తనిఖీ చేసింది. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకూ జరిగిన పనుల తనిఖీని పూర్తి చేశారు. ప్రజావేదికలో ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 800 పైగా జరిగిన పనులకు గాను రూ. 11 కోట్లు నిధులు వెచ్చించినట్లు చెప్పారు. అయితే వివిధ పనుల్లో రూ.70 వేలు అవినీతి జరిగిందని, ఉపాధి సిబ్బంది నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ వాసుదేవగుప్తాతో పాటు ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

రొద్దం: మండల పరిధిలోని చెరుకూరు గ్రామానికి చెందిన ఉప్పర నరసింహమూర్తిపై అదే గ్రామానికి చెందిన ప్రభు దాడి చేయడంతో ప్రభుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. ప్రభు గ్రామంలో పేకాట స్థావరాలు నడుపుతుంటాడని చెప్పారు. అయితే పేకాటపై తమకు నరసింహమూర్తి సమాచారం ఇచ్చారన్న కోపంతో అతనిపై దాడికి పాల్పడినట్లు వివరించారు. గ్రామాల్లో ఘర్షణలు, గొడవలు పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏటీఎంల భద్రత గాలికి !

- చాలా ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డుల కరువు
- భద్రతతో సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్న బ్యాంకులు
- ఏదైనా చిన్న సమస్య వచ్చినా వినియోగదారుల అవస్థలు

▸▸ హిందూపురం పట్టణంలోని ఓ ఏటీఎంలో డబ్బు డ్రా చేసుకునేందుకు వెళ్లిన ఓ మహిళ నగదు డ్రా చేసుకున్న తరువాత ఏటీఎం కార్డు మిషన్ నుంచి రాకపోవడంతో నానా అవస్థలు పడింది. అక్కడ ఎవరూ రక్షణగా లేకపోవడంతో చివరకు సమీపంలో ఉన్న దుకాణదారుడిని బతిమాలి అక్కడకు తీసుకొచ్చి ఎలాగో కార్డు తీసుకుంది. సెక్యూరిటీ సిబ్బంది ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని మహిళ వాపోయింది.



హిందూపురం నానెప్పనగర్‌లో సెక్యూరిటీ లేని ఏటీఎం

హిందూపురం అర్బన్: బ్యాంకు ఖాతాదారుల సౌకర్యం కోసం అందుబాటులోకి తెచ్చిన ఏటీఎంల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడపడితే అక్కడ అందుబాటులో ఉన్న ఏటీఎంల నిర్వహణతో పాటు భద్రతను బ్యాంకులు గాలికి వదిలేశాయి. ఏటీఎం కేంద్రాలకు సరైన రక్షణ లేక పోవడం, అక్కడ ఏదైనా సమస్య తలెత్తితే సమాధానాలు చెప్పేవారు లేక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. కేటుగాళ్లు వినియోగదారులను ఏమార్చి డబ్బులు డ్రా చేసుకొని వెళ్లిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి.

'పురం'లో 52 ఏటీఎంలు

జిల్లా వ్యాప్తంగా 190 వరకూ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్యాంకులకు సంబంధించిన 392 ఏటీఎం కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్క హిందూపురంలోనే 52 ఏటీఎంలు ఉన్నాయి. వీటిలో నగదు నింపడం నుంచి నిర్వహణ బాధ్యతలను మొత్తం ప్రైవేటు ఏజెన్సీలే చూస్తున్నాయి. దీంతో బ్యాంకర్లు తమకు సంబంధం లేదనే రీతిలో ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే భద్రత దృష్ట్యా ఏటీఎంల వద్ద సెక్యూరిటీని ఉంచిన బ్యాంకులను చేతి వేళ్లపై లెక్కించవచ్చు. మిగతా చోట్ల సెక్యూరిటీ సిబ్బంది ఉంటే ఒట్టు. ఇక బ్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన ఏటీఎంలను రాత్రివేళ మూసి వేస్తున్నారు. మళ్లీ బ్యాంక్ తీసినప్పుడు మాత్రం తెరిచి ఉంచుతుండటంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు.

ఏటీఎం సెంటర్లే షెల్టర్లు

హిందూపురం పట్టణ శివారు ప్రాంతాల్లోని ఏటీఎం కేంద్రాలు వర్షానికి, చలికి తలదాచుకొనేందుకు షెల్టర్లుగా మారాయి. కొన్ని ఏటీఎంలు కుక్కలకు కేంద్రాలుగా మారాయి. ఏటీఎంలలో నగదు పెట్టడం తప్ప భద్రతా విషయాలను ప్రైవేట్ ఏజెన్సీలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కుక్కలు ఏటీఎం కేంద్రాల్లో ఉంటుండటంతో వాటిల్లోకి వెళ్లాలంటేనే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

తగ్గుతున్న ఆదరణ

గుగుల్‌పే, ఫోన్ పే, యూపీఐలు వచ్చిన తరువాత ఏటీఎంల ఆదరణ తగ్గుతోంది. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు ఖాతాల్లో ఉన్న నగదు క్షణాల్లో ఇతరులకు పంపడం, ఇతరుల నుంచి తీసుకోవడం చేస్తున్నారు. దీంతో ఏటీఎంలకు వెళ్లే వారి సంఖ్య గతంతో చూస్తే తగ్గుతోంది.

సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి



హిందూపురం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో నెట్ బీట్లకు వెళ్లే పోలీసులకు తగిన సూచనలు ఇస్తున్నాం. రాత్రి వేళ గస్తీ తిరిగే పోలీసులు ఏటీఎంలు, పరిసరాల్లో నిఘా ఉంచేలా చూస్తున్నాం. ప్రధానంగా సంబంధిత బ్యాంకులు సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవడం మంచిది. ఇదే విషయం బ్యాంకర్లకు ఎన్నోసార్లు చెప్పాం.

– శ్రీనివాసులు, సీఐ, హిందూపురం

ఎంఎల్‌హెచ్‌పీపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

గోరంట్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి వేధింపులు తాళలేక ఈ ఏడాది మేలో గోరంట్ల పట్టణంలో ఆశావర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న శబరీ అనే మహిళ ఆత్మహత్యకు యత్నించింది. అయితే గౌతమిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ఇందులో భాగంగానే ఆశావర్కర్లతో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ అక్బల్‌బాషాకు ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. శబరీకి న్యాయం జరిగే వరకూ తాము విధులను బహిష్కరిస్తున్నట్లు ఆశావర్కర్లు పేర్కొన్నారు. తహసీల్దార్ స్పందిస్తూ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి దారి చూపండయ్యా..

రొద్దం: మండల పరిధిలోని పెద్దకోడిపల్లిలో ఓ స్థలం విషయంలో తమకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసులు కుటుంబ సభ్యులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సర్వేనంబర్ 460లో తమ ఇంటికి దారి లేకుండా సమస్య సృష్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వలీబాషా అక్కడికి చేరుకొని వారికి సర్ది చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే తహసీల్దార్ వద్ద ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం బాధితులు తహసీల్దార్ వద్దకు చేరుకున్నారు. రికార్డులు పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ వారికి హామీ ఇచ్చారు.



నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎస్ఐ

ఏబీవీపీ ధర్మవరం కార్యదర్శిగా పామిశెట్టి శ్రీనివాసులు



ఏబీవీపీ నగర కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న జిల్లా కన్వీనర్ వాసుదేవ్

ధర్మవరం: ఏబీవీపీ ధర్మవరం నగర కార్యదర్శిగా పామిశెట్టి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. స్థానిక సాయికృప కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కన్వీనర్ వాసుదేవ్ సమక్షంలో నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగర కార్యదర్శిగా పామిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా కోరే చైతన్య, సహాయ కార్యదర్శిగా కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్‌గా వినయ్, కళామంచు కన్వీనర్‌గా శశి, ఖేల్ కన్వీనర్‌గా లోకేష్, హాస్టల్స్ కన్వీనర్‌గా చైతును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యుత్ సరఫరాలో ఆటంకాలు రానీయొద్దు



విద్యుత్ అధికారులతో చర్చిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: ముదిగుబ్బ మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై బుధవారం సలహాదారుల మండలి సభ్యులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, విశ్రాంత ఎస్ఈ వెంకటసుబ్బయ్య, ఎంపీపీ ఆదినారాయణ తదితరులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన ప్రణాళికల గురించి ట్రాన్స్‌కో ఈఈ మోజెస్, ఏడీ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జ్ ఏఈ నరేష్‌తో చర్చించారు.

జగన్‌ను కలిసిన చలమారెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చలమారెడ్డి

ముదిగుబ్బ: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముదిగుబ్బ మండలానికి చెందిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు డీవీ చలమారెడ్డి బుధవారం తాడేపల్లిలో కలిశారు. మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పడుతున్న ఇబ్బందుల గురించి అధినేత దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని జగన్ భరోసా ఇచ్చారని చలమారెడ్డి తెలిపారు.

కుట్టుమిషన్ల పంపిణీ



టైలరింగ్ సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని అమ్మవారిపల్లిలో కియా పరిశ్రమ సహకారంతో 75 మంది మహిళలకు బుధవారం కుట్టు మిషన్లు, సామగ్రి పంపిణీ చేశారు. గుట్టూరు, అమ్మవారిపల్లి, ఎర్రమంచి గ్రామాలకు చెందిన మహిళలకు మూడు నెలల పాటు కుట్టులో శిక్షణ ఇచ్చారు. నెలకు రూ.21 వేల స్టైఫండ్ కూడా ఇచ్చారు. ఇందులో భాగంగానే కియా పరిశ్రమలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా కియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కబ్దాంగ్ లీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కియా సంస్థ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే కుట్టులో శిక్షణ ఇచ్చామన్నారు. కియా పరిశ్రమ ఇప్పటి వరకు ఎన్నో సామాజిక కార్యక్రమాలను కియా పరిశ్రమ (సీఎస్ఆర్) ద్వారా చేపట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కియా పరిశ్రమ సహకారం ఉంటుందన్నారు.

చిరుధాన్యాలను పండించాలి

గుడిబండ: స్థానిక వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య కార్యాలయంలో 60 మంది మహిళా కిసాన్ రైతులకు 60 ఎకరాల్లో సాగు చేయడానికి 1.50 కేజీల 98 ప్యాకెట్ల సజ్జలను డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి నరసయ్య రైతులకు పంపిణీ చేశారు.